విత్తనాలు సిద్ధం.. సాగుకు సన్నద్ధం

- తొలకరి పనులు ప్రారంభిస్తున్న రైతులు
- విత్తన శుద్ధిపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయ అధికారులు



ట్రాక్టర్‌తో పొలంలో దుక్కులు



గండ్రేడులో సిద్ధం చేసుకున్న నారుమడి

పెదపూడి: తొలకరి సాగు కోసం ఈ నెల 1వ తేదీనే పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అందుబాటులో ఉంచింది. దీంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమై నారుమడుల పనులు చేసుకుంటున్నారు.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో కలిపి మొత్తంగా ఖరీఫ్‌లో సుమారు 86,000 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. బోర్లు, ఇంజన్ల వద్ద సుమారు 15 రోజుల క్రితం నుంచే నారుమడుల పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా గడుపుతున్నారు. ఇప్పటి వరకూ అనపర్తి నియోజకవర్గంలో సుమారు 5 శాతం మేర నారుమడులు సిద్ధం చేసినట్లు అంచనా. కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసిన నేపథ్యంలో పెద్ద కాలువల నుంచి వాటి అనుబంధ కాలువలకు సాగునీరు నెమ్మదిగా చేరుతుంది. ముందుగా బోర్ల వద్ద నారుమడులు వేసిన చోట జులై మొదటి, రెండో వారాల నుంచి వరినాట్లు వేయనున్నారు.

విత్తన శుద్ధితో నాణ్యమైన నారు

విత్తనం కొన్న వెంటనే 100 గింజలను మొలక పరీక్ష చేసి 80 శాతం మొలక వచ్చిన విత్తనాలనే వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే విత్తన శుద్ధితో నాణ్యమైన నారు లభిస్తుంది. పొడి శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కార్బండిజం మందు విత్తనాల సంచిలో వేసి మూతి బిగించి బాగా కలిపి 24 గంటలు నిల్వ ఉంచాలి. ఆ తర్వాత వాటిని నానబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. తడి విత్తన శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు ఒక గ్రాము కార్బండిజం, ఒక లీటరు నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టి మరో 24 గంటలు మండి కట్టి వాటిని నారుమడిలో చల్లుకోవాలి.

నారుమడి తయారీ

నారుమడి తయారు చేసుకోవడానికి వినియోగించే భూమిలో చివరి దుక్కులో ఐదు సెంట్ల భూమికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, కిలో ఎంఓపీ(మ్యూరేట్ పొటాష్)ను కలిపి దుక్కు చేయాలి. ఆకుమడిలో ముంపు నీరు దిగేందుకు చిన్న చిన్న బోదెలు, ఆకుమడి చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో విత్తనాలు చల్లుకున్న తర్వాత మొదటి ఆకు విచ్చుకునే వరకు 10 రోజుల పాటు ఆరుతడి యాజమాన్యం(నారుమడిలో నీరు పెట్టడం, తొలగించడం) నిర్వహించాలి. 11వ రోజు తర్వాత మొదటి ఆకు విచ్చుకున్నాక నారుమడిలో నీరు ఉండాలి. ఇలా నారుమడి వేసిన 21–25 రోజుల్లో నాణ్యమైన నారు తయారవుతుంది.

ఎకరా నారుమడికి 30 కేజీలు

ఒక ఎకరా నారుమడికి 30 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయి. సాధారణంగా ఖరీఫ్‌లో 92 శాతం స్వర్ణ రకం ఎంటీయు, 7029, ఎంటీయు 1318 రకాలు సాగు చేస్తారు. మిగిలిన 8 శాతంలో ఇతర రకాలు సాగు చేస్తారు. విత్తనాలు రైతు భరోసా కేంద్రాలు, పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉన్నాయి. లైసెన్స్ పొందిన షాపులు, రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసుకోవాచ్చు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అందుబాటులో ఉన్నాయి. విత్తన శుద్ధి తరువాతే నారుమడులు వేయాలి. నారుమడి తయారు చేసేటప్పుడు విత్తనాల సంచిని, ట్యాగ్‌ను, రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలి.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి మండలం

క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి స్వామివారు

పెదపూడి: జి.మామిడాడ సూర్యనారాయణ మూర్తి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని వ్రతాలు చేయించుకున్నారు.

కాలభైరవుని విగ్రహానికి తొలి అభిషేక పూజలు



కాలభైరవ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

అనపర్తి: స్థానిక పాతవూరు ధరణికోటలో ఉమామహేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన కాలభైరవుని విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం తొలి అభిషేక పూజలు జరిపారు. ఆదివారం అమావాస్య తిథి కావడంతో ఆలయ అర్చకులు కొత్తూరి సత్యనారాయణమూర్తి(రాజా), సుబ్రహ్మణ్యశర్మ, మణికంఠశర్మల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు సబ్బెళ్ల చినఅమ్మిరెడ్డి, కమిటీ ప్రతినిధులు చిర్ల సూరారెడ్డి, తమలంపూడి వెంకటరెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, పార్టీ నాయకులు సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎస్ఎస్, చింతా శ్రీనివాసరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాజుల చెరువుకు గంగ పూజ, హారతి



గాజుల చెరువుకు హారతి ఇస్తున్న రైతులు

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో గాజుల గొయ్యి చెరువుకు ఎత్తిపోతల కార్యనిర్వాహక అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు ఆదివారం గంగ పూజ చేసి హారతులిచ్చారు. ఈ సందర్భంగా సోమన్న చౌదరి మాట్లాడుతూ రైతులు నీటిని పొదుపుగా వాడి అధిక దిగుబడులను సాధించాలన్నారు. సకాలంలో నీటితీరువా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎత్తిపోతల డైరెక్టర్ పొట్రు జోడపల్లి గోవింద గుప్తా, మెహర్‌బాబా పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న జక్కంపూడి గణేష్

మధురపూడి: కోరుకొండ గ్రామ దేవత అంకాలమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా వడ్డన చేశారు. కోరుకొండ, జంబూపట్నం, పశ్చిమగానుగూడెం, శ్రీరంగపట్నం, కాపవరం గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

ఆర్థిక సాయం

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కొలిపే సురేష్ ఇల్లు కాలిపోయింది. ఈ నేపథ్యంలో బాధితుడికి ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఆర్బీకే ఎడ్వైజరీ కమిటీ డైరెక్టర్ గద్దె వీరన్నబాబు (బాబీ) రూ.5 వేలు, బాలభక్త భజన సమాజం రూ.15 వేలు, పీఏసీఎస్ చైర్ పర్సన్ కొండిపాటి కోటేశ్వరరావు రూ.వెయ్యి అందించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు ఆదివారం తెలిపారు. తమకందిన సమాచారం మేరకు దాడి చేసి కొమరిపాలెం గ్రామం శివారులో పేకాట ఆడుతున్న తొస్సిపూడికి చెందిన టి.దుర్గాప్రసాద్, కొమరిపాలేనికి చెందిన ఎన్.చిన్నబాబు, ఎం.వీర్రాఘవరెడ్డిలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.2,050 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా డేవిడ్‌రాజు



డేవిడ్‌రాజుకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా అనపర్తికి చెందిన పాదూరి డేవిడ్‌రాజును నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీచేశారు. సదరు ఉత్తర్వుల ప్రతిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం డేవిడ్‌రాజుకు అందజేశారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కమిటీ సభ్యులుగా జిల్లా పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా ఎస్పీ వ్యవహరించే ఈ కమిటీలో నాన్ అఫీషియల్ కమిటీ సభ్యుడిగా డేవిడ్‌రాజు రెండు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగుతారని ఎమ్మెల్యే తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యేకు పాదూరి డేవిడ్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. డేవిడ్‌రాజును ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కొమరిపాలెం, పొలమూరు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్లు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సత్తి సూరారెడ్డి తదితరులు అభినందించారు.

కేసులు ఎత్తివేయాలంటూ ర్యాలీ



రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

గోకవరం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్‌పర్సన్ విమలక్క, మోహన్ బైరాగిలతో పాటు పలువురుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన ఉపా చట్టం కేసులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంపయర్రంపాలెంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన కలాన్ని, గళాన్ని ఉపయోగించి పోరాడుతున్న వారిపై ఉపా చట్టం కింద కేసులు మోపడం బాధాకరమన్నారు. దేశంలో దళిత మహిళలు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఇప్పటికైనా విమలక్క, మోహన్ బైరాగిలపై పెట్టిన కేసులు కొట్టేయకుంటే మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, వల్లూరి రాజబాబు, రమేష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ తేజో ఫణీంద్ర

సీతానగరం: ఉండేశ్వరపురం గ్రామ సచివాలయంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ మాకాల ఈశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం వేదస్పైన్ సెంటర్ వైద్యులు తేజో ఫణీంద్ర సుమారు 146 మందికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వెన్నుముక వంకర్లు, వెన్నుముక క్యాన్సర్, స్పాండిలైటిస్, మెడనొప్పి, నడుము నొప్పి, తిమ్మిర్లు, డిస్క్ సమస్యలు తదితర వాటికి చికిత్స చేశారు. సర్పంచ్ ఈశ్వరరావు, ఎంపీటీసీ మట్టా వెంకట రమణ మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం పేద ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో రాధాస్వామి, రాజు, ఆసుపత్రి సిబ్బంది కుమారి, స్వర్ణ, లోకేష్, సతీష్, స్థానికులు నరిశెట్టి శివ, పాలిసెట్టి సత్తిబాబు, మన్నే నాగరాజు, మట్ట దుర్గారావు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న బాలుడిపై కేసు

సీతానగరం: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇనుగంటివారిపేటలో స్నేహితుల వద్దకు కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన బాలుడు తరచూ వస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో బాలికను ప్రేమించాలని వేధిస్తున్నాడు. శనివారం కూడా ఇనుగంటివారిపేట వచ్చాడు. అమ్మమ్మ ఇంటికి వెళుతున్న బాలిక నోరు, గొంతు నొక్కి పాడుపడిన భవనంలోకి తీసుకువెళ్లి తలను గోడకేసి కొట్టాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బ్లేడ్ తీయగా బాలిక భయంతో కేకలు వేసింది. దీంతో బాలుడు పారిపోయాడు. బాలిక ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాజమహేంద్రవరం సిటీ: నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా చైతన్య సంస్థ గురువు ఎస్.శివ శంకరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జాంపేటలోని ఉమా రామలింగేశ్వర కల్యాణ మంటపంలో యోగాశిక్షణ నిర్వహించారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో యోగా చైతన్య సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్‌బీఐ రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ మాధురీబాల, సీనియర్ గైనకాలజిస్టు వాసిరెడ్డి బిందు శ్రీదేవి, అమరావతి సర్కిల్ డీజీఎస్ బి.పాపారావు, ఏజీఎస్ జేఎస్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ట్రెజరర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్షంతో ఆరుతడి పంటలకు ఊపిరి



ఈలకొలనులో మొక్కజొన్న తోట

రంగంపేట: వేసవి ఉష్ణోగ్రతలతో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఆరుతడి పటలకు ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షం ఊపిరి పోసింది. వర్షం ప్రభావంతో మెట్ట ప్రాతం ముద్దయ్యింది. దీంతో ఆరుతడిగా సాగయ్యే ఉద్యాన పంటలైన కూరగాయలు, మిరప, మొక్కజొన్న, పామాయిల్, పండ్ల తోటలకు నీరందిందని రైతులు చెబుతున్నారు. వర్షం కారణంగా రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యానవన పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులంటున్నారు. వర్షం కారణంగా మెట్టప్రాంత రైతులకు ఎంతో మేలు జరిగిందని ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ తెలిపారు.

మదనగోపాలస్వామికి మండలాభిషేకం



స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిస్తున్న వేదపండితులు

అనపర్తి: మండలంలోని పొలమూరులో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదనగోపాలస్వామికి ఆదివారం మండలాభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పునఃనిర్మించిన ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగి మండల కాలం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతికి చెందిన వేదపండితులు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం జరిపించారు. పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులతో పాటు జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి సూరారెడ్డిలు పాల్గొన్నారు.

టీటీలో మేటిగా..

- సత్తాచాటుతున్న యువ క్రీడాకారులు
- జాతీయ పోటీలకు ఎంపిక



విశాఖలో జరిగిన 2023 ప్రీమియర్ లీగ్‌లో ట్రోఫీని అందుకున్న ప్రభాత్ సాయి తదితరులు



చెన్నై టోర్నమెంట్‌లో విజయం సాధించిన చార్వి పాల్గుణి, గిడుతూరి సిరి పావని, తాన్యశ్రీ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): టేబుల్ టెన్నిస్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఆటలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు సాధిస్తున్నారు. జాతీయ స్థాయిలో సత్తా చూపించేందుకు సన్నద్ధమవుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టేబుల్ టెన్నిస్ జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో బాలుర విభాగంలో టి.ప్రభాత్ సాయి, బాలికల విభాగంలో చార్వి పాల్గుణి, గిడుతూరి సిరి పావని, గిడుతూరి తాన్య శ్రీ, వైష్ణవి సూర్య ఎంపికయ్యారు. ప్రభాత్ సాయి, చార్వి పాల్గుణి, వైష్ణవి సూర్య ఇంటర్, సిరి పావని, తన్యశ్రీ హైస్కూల్ విద్యను అభ్యసిస్తున్నారు. విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ -19 బాలుర విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రభాత్ సాయి ద్వితీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. చెన్నైలో జరిగిన ఆలిండియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన బాలికలు 19వ జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు.

గౌతమి టెన్నిస్ అకాడమీలో శిక్షణ

ఈ క్రీడాకారులందరూ గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. అకాడమీ కోచ్‌లైన వీటీవీ సుబ్బారావు, పి.వేణు గోపాలరావు వద్ద మెలకువలు నేర్చుకుంటున్నారు. ఈ అకాడమీలో ప్రతి బ్యాచ్‌కు 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. అసోసియేషన్‌కు అధ్యక్ష, కార్యదర్శులుగా జేవీవీ అప్పారెడ్డి, సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. నగరానికి చెందిన వి.భాస్కరరామ్ టీటీఎఫ్‌ఐ ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతో..

విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్లే ఫీట్ టీం ఆధ్వర్యంలో 2023 ప్రీమియర్ లీగ్ పోటీల్లో ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులను ఆరు గ్రూప్‌లుగా విభజించి ప్రతి గ్రూప్‌లో ఏడుగురు సభ్యులు ఉండేలా టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆరు గ్రూప్‌ల మధ్య టేబుల్ టెన్నిస్-2023 ప్రీమియర్ లీగ్‌లో ఎస్ఎంఎస్ డెంటల్ గ్రూప్ విజయం సాధించింది. ఈ గ్రూప్‌లో నగరానికి చెందిన ప్రభాత్ సాయి ప్రతిభ కనబరిచి అవార్డును అందుకున్నాడు.

నాన్న ప్రోత్సాహం



నాన్న తీగిరెడ్డి బాపిరాజు ప్రోత్సాహంతో టేబుల్ టెన్నిస్‌లో అడుగు పెట్టాను. 8 ఏళ్ల వయసు నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించాను. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాను. ఆటతో పాటు చదువును ఆస్వాదిస్తున్నాను. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపే ధ్యేయంగా అడుగులు వేస్తున్నాను.

– ప్రభాత్ సాయి

ఆసక్తి పెరిగింది



గతంతో పోలిస్తే ఇప్పుడు టేబుల్ టెన్నిస్‌పై యువత ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా బాలురతో పాటు బాలికలుసైతం ఈ ఆటలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది. మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను.

– సుబ్బారావు, కోచ్

నేటి నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం సోమవారం నుంచి ఆన్‌లైన్ పక్రియ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి ఈనెల 24 వరకూ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈనెల 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 3న సీట్ల కేటాయింపు, 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 98489 89823, 79815 61722 నంబర్లను సంప్రదించాలన్నారు.

హేమవర్షితకు 2,245వ ర్యాంక్



దాసి హేమ హర్షిత

అనపర్తి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాయవరానికి చెందిన దాసి హేమవర్షిత ఆల్ ఇండియా 2,245వ ర్యాంక్ సాధించింది. ఆమె అనపర్తి జీబీఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంది. ఐఐటీలో బీటెక్ ఇంజినీరింగ్ పూర్తి చేయడమే తన లక్ష్యమని హేమవర్షిత తెలిపింది. తన కుమార్తె ఆల్ ఇండియా ర్యాంకు సాధించడంపై ఆమె తల్లి ప్రసన్న కుమారి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హేమవర్షితను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, స్థానిక నేతలు అభినందించారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



పశ్చిమగానుగూడెం సెయింట్ లూథరన్ చర్చిలో వేడుకలు

మధురపూడి: ఫాదర్స్ డే వేడుకలను ఆదివారం కోరుకొండ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లను సత్కరించారు. పశ్చిమగానుగూడెం సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో పారిస్ పాస్టర్ రెవరెండ్ కృపావిల్సన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. విశాఖపట్నం జిల్లా నర్సీపురం లూథరన్ చర్చికి చెందిన రెవరెండ్ వి.సైమన్ సెయింట్ థామస్ వాక్య సందేశాన్నిచ్చారు. కోటికేశవరంలోని మహిమ మందిరంలో పాస్టర్ రాజు జోషియా ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ థామస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కోరుకొండ ఎంపీటీసీ గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, కోటికేశవరం సర్పంచ్ ముడే సింధూదివ్య, ముడే కామేష్, ఎజ్రా, వరదానం, బెల్లపు డేవిడ్ పాల్గొన్నారు.

ఎంఈఓ-2గా జ్యోతి ప్రసాద్



రాజానగరం: మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)- 2గా జీజేవీవీఎస్ఎన్ జ్యోతిప్రసాద్ నియమితులయ్యారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరును తరచూ పర్యవేక్షిస్తూ, మెరుగైన ఫలితాలను సాధించడం, ఆయా మండలాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించడానికి మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించాలని ప్రభుత్వం భావించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కాకినాడలో నిర్వహించిన ఎంఈఓ -2 కౌన్సెలింగ్ ద్వారా జ్యోతిప్రసాద్ రాజానగరం మండలానికి వచ్చారు. గతంలో ఆయన ఇదే మండలంలో ఎంఈఓగా పనిచేశారు. అనంతరం పుణ్యక్షేత్రం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన వెబ్ కౌన్సెలింగ్‌లో కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు.

నేడు ముగ్గళ్లలో గడప గడపకూ..

రాజానగరం: సీతానగరం మండలం ముగ్గళ్లలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుంది. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారు.